ప్రజాశక్తి

ఆదివారం 1 అక్టోబర్ 2023

3న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నట్లు ఒఎస్‌డి/ప్రిన్సిపల్ డాక్టర్ డిఆర్ఎస్ గంగస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం మంగళవారం ఉదయం 10 గంటలకు విద్యార్థులు హాజరు కావాలన్నారు. పాలిసెట్-2023 రాసి సీటు రానివారు, సీటు వచ్చి కళాశాలలో చేరని వారు, పదో తరగతి పాస్సై, పాలిసెట్ రాయని వారు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లకు వచ్చే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. సీటు పొందిన వారు మొత్తం ఫీజును తక్షణమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి ఉపకారవేతనాలందని, మూడేళ్ల పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర కళాశాలలో ఇదివరకే ప్రవేశం పొందిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం లేదన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

వైసిపి జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో మంత్రి బొత్స

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాబోయే ఎన్నికలలో 175కి గాను 175 సీట్లు సాధించి, అధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసి, వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, జిల్లా వైసిపి ఎన్నికల బాధ్యులు బొత్స సత్యనారాయణ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక లయన్స్ కల్యాణమండపంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో కలసి పాల్గొన్నారు. ముందుగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేరువయ్యామని, దీని ద్వారా ప్రజల ఆర్థిక పరిస్థితులు, జీవన ప్రమాణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి వాటి మెరుగుకు కృషి చేశామన్నారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, 45రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం పాటు ప్రతి గ్రామానికి వెళ్లి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలన్న అవసరాన్ని వివరించాలని తెలిపారు. అలాగే ఈనెల 9న సిఎం జగన్ నిర్వహించే సమావేశానికి మండల, జిల్లా స్థాయి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని, రాబోయే రోజులలో నాయకులు పనిచేయను మార్గదర్శకం చేస్తారని అన్నారు.

ప్రజల్లో సానుభూతి పొందాలనే చంద్రబాబు ప్రయత్నాన్ని తిప్పికొట్టాలి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతికి పాల్పడి జైలుపాలైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారని, దీన్ని నాయకులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని అన్నారు. తాజా కేసులో 17(ఎ) నోటీసుపైనే మాట్లాడుతున్నారని, తప్పు చేయలేదని ఎందుకు చెప్పడం లేదని, ప్రజల దృష్టి మరల్చడానికి ఇంటింటా డప్పులు వాయించాలని సిగ్గులేకుండా పిలుపునివ్వడాన్ని ఎద్దేవా చేశారు. ఆయన తప్పు చేయకపోతే ఆ విషయంపై తెదేపా ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన చర్చలో పాల్గొన కుండా ఎందుకు బాయికాట్ చేశారని ప్రశ్నించారు.

వైసిపి నాయకులు అందరి జాతకాలు జగన్ వద్ద ఉన్నాయి

అందరి నాయకులు జాతకాలు ముఖ్యమంత్రి జగన్ దగ్గర ఉన్నాయని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, కార్యక్రమాల్లో వెనుకబడితే చర్యలు ఉంటాయని మంత్రి బొత్స సత్యనారాయణ తన ప్రసంగంలో కొంతమంది నాయకులను హెచ్చరించారు. తప్పుచేస్తే ఎంతటి వారైనా శిక్ష తప్పదని, ఫోక్స్‌వేగన్ కేసులో తనపైనా ఆరోపణలు వచ్చాయని, అయితే తాను దానిపై స్వచ్ఛందంగా విచారణ కోరి, నిజాయితీ నిరూపించుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శోభాహైమావతి, వాకాడ నాగేశ్వరరావు, నాలుగు నియోజకవర్గాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పేదలకు ఆరోగ్య సురక్ష : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) పేదలకు రక్ష అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేదలపాలిట వరమన్నారు. అందులో ఇప్పటికే ఇంటింటి సర్వేలో భాగంగా ఏడు పరీక్షలు నిర్వహించారని చెప్పారు. నవంబరు 10 వరకు జిల్లాలో 287 వైద్య శిబిరాలు జిల్లాలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపకల్పన చేశారని, ఇందులో ఐదు శిబిరాలు పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 84 మంది స్పెషలిస్టు వైద్యులు పాల్గొంటున్నారన్నారు. కావున ఈ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

మండల స్థాయి తనిఖీ అధికారులు వీరే

ఈ పథకం కింద మండల స్థాయి తనిఖీ అధికారులుగా జిల్లా అధికారులను నియమించినట్లు రాజన్నదొర తెలిపారు. పాచిపెంట - ఆర్.శివప్రసాద్ (డిఎస్ఒ), బలిజిపేట -కె.రాబర్ట్ పాల్, (జిల్లా వ్యవసాయ అధికారి), గరుగుబిల్లి ఒ.ప్రభాకరరావు (జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి), మక్కువ-కె.విజయ గౌరి (బిసిడిఎస్ పిడి), పార్వతీపురం - మల్లికార్జున (జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి), కొమరాడ - కెవిఎస్ఎస్ రెడ్డి (జిల్లా ఉద్యాన అధికారి), సీతానగరం - కె. రామచంద్రరావు (డ్వామా పిడీ), సాలూరు - జె.శాంతీశ్వరరావు (గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి), పాలకొండ - ఎల్.అశోక్ కుమార్ (జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి), వీరఘట్టం - పి.కిరణ్ కుమార్ (డిఆర్‌డిఎ పిడి), గుమ్మలక్ష్మీపురం - వై.సత్యంనాయుడు (ఎపిడి, గిరివెలుగు), కురుపాం - బలివాడ సత్యనారాయణ (డిపిఒ), సీతంపేట - ఎస్.సింహాచలం (ఇఇ, గిరిజన సంక్షేమ శాఖ, సీతంపేట), భామిని - సి.మల్లికార్జున రెడ్డి (డిటిఒ), జియ్యమ్మ వలస - ఎం.డి.నాయక్ (జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ), పాలకొండ (పట్టణం) - టి.రమేష్ (హౌసింగ్ పీడీ), పార్వతీపురం (పట్టణం) - బి.సత్యనాయుడు (జిల్లా సహకార అధికారి), సాలూరు (పట్టణం) - డి.మంజుల వీణ (డివిఇఒ)ను నియమించినట్లు ఆయన చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్య శిబిరం తేదీ, సమయం, వైద్య నిపుణుల వివరాలు, ఉచిత పరీక్షలు గురించి పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. శిబిరాలు విజయవంతం కావాలన్నారు. ఆరోగ్య శిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఒక స్పెషలిస్టు డాక్టర్ హాజరవుతారని చెప్పారు. మండలానికి ఒక గ్రామం చొప్పున రోజూ వైద్య శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. దీనివల్ల గ్రామాలు, వార్డుల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో సత్వర వైద్యం అందుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికార, అనధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

బ్యాలెట్ యంత్రాల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల యాక్సిప్టెన్సీ టెస్ట్ విధానాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం పరిశీలించారు. అక్సెప్టెన్స్ టెస్ట్ ను శుక్రవారం నుండి బి.ఇ.ఎల్ సంస్థ ఇంజినీర్లు చేపట్టారు. జిల్లాకు 3250 బేలట్ యూనిట్లు, 2560 కంట్రోల్ యూనిట్లు, 3170 వివిపాట్ లు కేటాయించడం జరిగిందని, 3170 వివిపాట్ లలో 2170 జిల్లాకు చేరాయని తెలిపారు. బేలట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల అక్సెప్టెన్స్ టెస్ట్‌లను ప్రారంభించామని, రాజకీయ పార్టీల ప్రతినిధులను పరిశీలించాలని కోరామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకట రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు 18 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాలలో మైదానంలో ఈనెల 16 నుండి 27 వరకు జిల్లాస్థాయి క్రీడలు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో స్థానిక గిరిజన బాలికల ఉన్నత పాఠశాలకు 18 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఎ.లిల్లిరాణి తెలిపారు. అండర్ -17 వాలీబాల్, హకీ, ఆర్చరీ, బాస్కెట్బాల్ తదితరు క్రీడల్లో ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

బాబు అరెస్టుకు నిరసనగా మోగిన మోత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చంద్రబాబునాయుడుకు మద్దతుగా మండలంలో టిడిపి నాయకులు శనివారం రాత్రి మోత మోగిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఎల్విన్‌పేటలో కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని గంటకొట్టి చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యదర్శి పి.శ్రీనివాసరావు, నాయకులు సొంటేన రాజేష్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తగూడ లో చంద్రబాబుకు సంఘీభావం...

కొత్తగూడలో టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి ఆధ్వర్యంలో గిరిజనులు చంద్రబాబుకు మద్దతుగా గంట కొట్టి సంఘీభావం తెలిపారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్ ఫోన్ వెలుగుల మధ్య కంచాలు పట్టుకుని మోత మోగించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కొండలరావు, గిరిజనులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : టిడిపి పార్టీ రాష్ట్ర వ్యాప్తం పిలుపు నిచ్చిన మోతమోగిద్దాం కార్యక్రమం విజయవంతమైంది. నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి, బహిరంగ ప్రదేశాల్లోకి వచ్చి అందుబాటులో ఉన్న వాయిద్య పరికరాలు, విజిల్స్, పళ్లాలపై గరిటలతో చప్పుడు చేస్తూ ఏకధాటిగా మోత మోగించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోనెల విజయచంద్ర పట్టణంలో పాతబస్టాండ్ కూడలిలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, సీనియర్ నాయకులు బార్నాల సీతారాంతో కలిసి డప్పులు వాయించారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మండలంలోని కృష్ణపల్లిలోని ఎన్టీఆర్ కూడలిల్లో నాయకులు కార్యకర్తలతో కలిసి నిరసనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డి.శ్రీదేవితో కలిసి తమ ఇంటి ప్రాంగణంలో పల్లేలను వాయించి సందడి చేశారు.

వీరఘట్టం: చంద్రబాబు అక్రమ అరెస్టుకు సంఘీభావంగా శనివారం రాత్రి వీరఘట్టం, ఎం.రాజపురంలో మోత మోగిద్దాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జిని నిమ్మక జయకృష్ణ , మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, సింహాచలం, మాచర్ల అనిల్‌కుమార్, బల్ల హరిబాబు, పారిచర్ల వెంకటరమణ, డి శ్రీనివాసరావు, పి.మహేష్, ఎన్.శశికుమార్, జి.గౌర్నాయుడు, ఆర్ తాతబాబుతో పాటు జనసేన నాయకులు కె.పవన్‌సాయి, కోడి వెంకటరమణ నాయుడు, ఎం.పుండరీకం, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఈలలు వేస్తూ బైక్ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

సాలూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు కి నిరసనగా శనివారం సాయంత్రం 7గంటలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు పల్లాలు, బిందెల పై వాయిస్తూ నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆధ్వర్యాన పట్టణ నాయకులు కార్యకర్తలు మోత మోగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగిస్తోందని, టిడిపి నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్లమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మామిడిపల్లిలో టిడిపి మోత మోగిద్దాం కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు ఆముడాల పరమేష్, బూస తవుడు, తాడు తురి తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా హాయ్ సేవ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహణను (స్వచ్ఛత హై సేవ) పెద్ద ఎత్తున చేపట్టాలనికలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంపునకు ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు శనివారం స్వచ్ఛత హై సేవ కార్యక్రమంపై ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 955 గ్రామాల్లో 1910 కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 1454 కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పేర్కొన్నారు. "చెత్త రహిత భారత దేశం" (గార్బేజ్ ఫ్రీ ఇండియా) శీర్షికన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. జిల్లాలో గ్రామ పంచాయితీలు, గ్రామ సచివాలయం సిబ్బంది క్రియాశీలకంగా పని చేయాలని ఆయన ఆదేశించారు. పరిశుభ్రతకు, పారిశుధ్యంకు జిల్లా ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

సంకల్ప సప్తాహ్‌ను ప్రారంభించిన పిఎం

సంకల్ప సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి శనివారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. సంకల్ప సప్తాహ కార్యక్రమంలో భాగంగా దేశంలో ఆశావహ జిల్లాల్లో ఎంపిక చేసిన బ్లాకుల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆ ప్రాంత వాసుల ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడం జరుగుతుంది. ఆశావహ జిల్లాగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో భామిని మండలాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అక్టోబరు 3 నుండి 9 వరకు వివిధ కార్యక్రమాలను చేపడతారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లో మూడు బ్లాకులను ఎంపిక చేయగా భామిని మండలం ఎంపిక కావడం గమనార్హం. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు పి.కిరణ్ కుమార్, కె.రామ చంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.మల్లిఖార్జున, ఇన్ ఛార్జ్ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి నాగభూషణ రావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, సిపిఒ పి.వీర్రాజు, మండల ఎంపిపి మజ్జి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

ఒడిస్సా రాష్ట్రం నుండి అక్రమంగా తరలిస్తున్న 7 కేజీల 900 గ్రాముల గంజాయి శనివారం ఉదయం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. కలకత్తాకు చెందిన నఫీద్దీన్, హత్మేక్ ముళ్ల, సహజ రఫీక్ ఒడిశా నుంచి ఘాట్ రోడ్డు మీదుగా ఒక బ్యాగులో 7 కేజీల 900 గ్రాముల గంజాయిని భద్రపర్చి కాలినడకన పి.కోనవలస చెక్‌పోస్టు మీదుగా వచ్చారు. వీరిని తనిఖీ చేయగా, వీరి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించినట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు.

14 కాలేజీలకు నాడు-నేడు నిధులు

ప్రజాశక్తి - మక్కువ

జిల్లాలో నాడు-నేడు పనులకు గానూ 14 జూనియర్ కళాశాలకు రూ.12 కోట్ల 11 లక్షల 53 వేల నిధులు మంజూరయ్యాయని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి, స్థానిక జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ డి.మంజుల వీణ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 24 వాటర్ ప్లాంట్లు కూడా మంజూరయ్యాయని, ఆయా కళాశాలల విద్యార్థుల సంఖ్యను బట్టి మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 90శాతం వరకు నాడు నేడు పనులు పూర్తికా వచ్చాయని తెలిపారు. వాటర్ ప్లాంట్లు అవసరమైన త్రీఫేస్ విద్యుత్ సర్వీసుల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు.

పేలుడు సంభవించిన ట్రాన్స్‌ఫార్మర్

సబ్‌స్టేషన్‌లో భారీ పేలుడు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని నవగాం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అర్ధరాత్రి వేళ భారీ పేలుడు సంభవించింది. పవర్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయింది. ఈ ప్రమాదంలో లైన్‌మాన్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. లింబ్ బ్లాస్ట్ అవ్వడంతో ప్రమాదం సంభవించింది. కరెంటు ఆయిల్ చెల్లాచెదురు కావడంతో షిఫ్ట్ లైన్‌మేన్, ఇతర సిబ్బంది పరుగులు తీశారు. రాత్రి 3 గంటల తర్వాత ఆ చుట్టు పక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారుం. యార్డ్‌లో సక్రమంగా మెంటినెన్స్ లేకపోవడం వల్లే ఇటువంటి పేలుళ్లు జరుగుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు.

కౌన్సిలర్ల తోపులాట.. వాదులాట

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత తొలిసారి అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్ల మధ్య తోపులాట, వాదులాట జరిగింది. వైసిపి పాలకవర్గం పగ్గాలు చేపట్టి రెండున్నర ఏళ్ళు దాటిపోయాయి. మొదటిసారిగా టిడిపి కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో నిరసన గళం వినిపించారు. తమ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పోడియం ముందు బైఠాయించి సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో అజెండా లోని అంశాలపై చర్చ మొదలైంది. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం తోపాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎల్ఇడి దీపాలతో అలంకరించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు నామినేషన్ పద్ధతిలో ఈ పనిని వైభవ్ శ్రీ ఇన్ ఫ్రా స్ట్రక్చర్స్ కి అప్పగించడంపై టిడిపి కౌన్సిలర్లు టి.లక్ష్మోజీ, వి.హర్షవర్ధన్, కె.వరలక్ష్మీ, వైదేహి కృష్ణ, బి.సీతమ్మ ప్రశ్నించారు. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కుమారుడు పిపిఎస్ భరత్ కుమార్ యజమానిగా ఉన్న వైభవ్‌శ్రీ ఇన్ ఫ్రా స్ట్రక్చర్స్ కి నామినేషన్ పద్ధతిలో వర్క్ ఇవ్వొచ్చు నా అని టిడిపి సభ్యులు ప్రశ్నించగా ఇవ్వొచ్చునని ఎఇ సూరినాయుడు చెప్పారు. లక్ష రూపాయల అంచనా వేశామని, ఎంత పని జరిగితే అంతే బిల్లు చేస్తామని ఎఇ బదులిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణకు, వైద్య శిబిరాలు ఏర్పాటు కు ఖర్చు కోసం లక్ష రూపాయల అంచనాతో పెట్టిన అంశాన్ని టిడిపి కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహణకు వైద్య ఆరోగ్య శాఖ ఖర్చు చేస్తుంది కదా అని టిడిపి సభ్యులు ప్రశ్నించగా మున్సిపల్ కమిషనర్ జయరాం మాట్లాడుతూ పట్టణంలో నిర్వహణ బాధ్యతలను మున్సిపాలిటీయే చేపడుతుందని చెప్పారు. కార్యక్రమం నిర్వహణకు ముందు మున్సిపాలిటీ ఖర్చు చేస్తుందని, ప్రభుత్వం తర్వాత ఆ నిధులు విడుదల చేస్తుందని కమిషనర్ చెప్పారు. దీనిపై తాము డిసెంట్ తెలియజేస్తున్నామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి నిధులు లేవని చెపుతున్న అధికారులు ఇలాంటి కార్యక్రమాల కోసం సాధారణ నిధి ఎలా ఖర్చు చేస్తారని టిడిపి కౌన్సిలర్లు ప్రశ్నించారు.

ప్రజా సమస్యలు పక్కదారి



టిడిపి కౌన్సిలర్లతో వాగ్వివాదం చేస్తున్న చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైసిపి కౌన్సిలర్లు

అనంతరం చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మకి డిసెంట్ పత్రం అందజేశారు. ఆ తర్వాత చైర్ పర్సన్ ముందున్న పోడియం వద్ద బైఠాయించి సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆ వెంటనే వైసిపి కౌన్సిలర్లు, చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో సభలో కొంత సేపు గందరగోళం నెలకొంది. సమావేశంలో నినాదాలు చేయడం సరైనది కాదని చైర్ పర్సన్ ప్రతిపక్ష సభ్యులకు వారించారు. దీంతో వైసిపి, టిడిపి కౌన్సిలర్ల మధ్య వాదులాటకు దారితీసింది. ఆ తర్వాత టిడిపి కౌన్సిలర్లు బయటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత వైసిపి కౌన్సిలర్లు సమావేశం ప్రారంభించారు. పట్టణంలో 16వార్డులో ఒక భవన నిర్మాణానికి అవసరమైన అనుమతుల కోసం లంచం ఇచ్చి కమిషనర్ శంకరరావును ఎసిబికి పట్టించిన కాంట్రాక్టరు అదే భవనాన్ని ఎలా నిర్మిస్తున్నారని వార్డు కౌన్సిలర్ రాపాక మాధవరావు ప్రశ్నించారు. ఆ భవనం నిర్మాణానికి సంబంధించి అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ దానికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిరసనపై నిర్బంధమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం దృష్టిలో నిరసన తెలియజేయడం కూడా ఒక నేరంగా పరిణమించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగానే కాదు, కనీసం తమ మనసులో మాటను వివిధ రూపాల్లో బాహ్య ప్రపంచానికి తెలియపర్చే విధంగా వ్యవహరించడం కూడా ప్రభుత్వం దృష్టిలో శాంతిభద్రతల సమస్యగానో, ట్రాఫిక్ సమస్యగానో ప్రభుత్వం, ముఖ్యంగా మన జిల్లా పోలీస్ యంత్రాంగం చిత్రీకరిస్తోంది. గడిచిన వారంలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్‌వర్కర్లు, రాజకీయ నాయకులు చేపట్టిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, వాటిపై పోలీసులు ప్రయోగించిన నిర్బంధాలు, భయోత్పాతం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. విద్యార్థులు తమ వసతి గృహాల్లోనూ, పాఠశాలలు, కాలేజీల్లో సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించలేదు. దీంతో, కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు, వారికి నాయకత్వం వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు దాష్టిక చర్యలకు ఒడిగట్టారు. విద్యార్థుల బట్టలు ఊడదీసిమరీ బలవంతంగా జీపుల్లో ఎక్కించి స్టేషన్‌లో నిర్బంధించారు. ఒకరిద్దర్ని తీవ్ర పదజాలంతో దూషిస్తూ చేయిచేసుకున్న సంఘటన కూడా విజయనగరంలో చోటు చేసుకుంది. ఇక ముందు ఇలా ఆందోళనలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరింపు చర్యలకు కూడా దిగారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ సమయంలో బెనిఫిట్స్ చెల్లించాలని, విద్యార్హతను బట్టి ప్రమోషన్లు చెల్లించాలని అంగన్‌వాడీలు, ఆయాలు ఆందోళన చేపట్టడమే నేరమైంది. ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టినందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చాలా మందిని భయభ్రాంతులకు గురిచేశారు. కొంతమందిని అరెస్టుచేశారు. ఇంకొంతమందిని ఇళ్లల్లోనే నిర్బంధించారు. కలెక్టరేట్‌కు చేరుకోకుండా అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. తమకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని కోరిన భోగాపురం విమానాశ్రయ నిర్వాసితులపైనా నిర్బంధాలకు వెనుకాడలేదు. అప్రోచ్‌రోడ్డు కోసం సేకరించిన 39ఎకరాలకు గాను ఇంకా పరిహారం చెల్లించకపోవడంతో నిన్నగాక మొన్న సంబంధిత రైతులు పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వీరిపైనా అధికారులు నాన్ యూనిఫామ్‌లోవున్న పోలీసులను ఉసిగొల్పి తమ పనికానిచ్చేసుకున్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బొబ్బిలి టిడిపి నాయకులు బేబీనాయన సింహాచలం వరకు తలపెట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎక్కడికక్కడ టిడిపి నాయకులపై నిర్బంధాలు ప్రయోగించారు. తాజాగా జిల్లా కేంద్రంలో ర్యాలీకి తలపెట్టిన టిడిపి నాయకులను జిల్లా వ్యాప్తంగా గృహ నిర్బంధం చేశారు. ఇలా కేవలం రైతులు, విద్యార్థులు, అంగన్‌వాడీలే కాదు. ఉద్యోగులు, కార్మికులు, రాజకీయ నాయకులపైనా ఇదే రకమైన కక్షసాధింపుతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇక వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం చేస్తున్న ప్రజా ఆందోళనలపై ప్రభుత్వ వైఖరి, పోలీసుల చర్యల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. చివరకు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ సిపిఎం చేపట్టిన బైక్ యాత్రలోనూ, జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలోనూ పోలీసుల హడావుడి కనిపించింది. దీన్నిబట్టి ప్రజా, కార్మిక, పౌర, రాజకీయ ఉద్యమాలను అణిచివేయడం ద్వారా పాలన చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు, భ్రమలుపడుతున్నట్టు అర్థమౌతోంది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్టే ప్రజల్లో గూడుగట్టుకున్న అసంతృప్తి, పెల్లుబికుతున్న వ్యతిరేకతను ఆపడం ఎవరి తరమూ కాదన్న విషయం గ్రహించలేకపోతోంది. ఆ మాటకొస్తే అంగన్‌వాడీలను అరెస్టులు, నిర్బంధాలు చేసినంతమాత్రానా నిరసన సెగ ఆగలేదు. విద్యార్థుల చేపట్టిన ఆందోళనదీ అదే తీరు. సుమారు 20రోజులుగా టిడిపి నాయకులపై ఉక్కుపాదం మోపుతున్నా ఏదో ఒక రూపంలో నిరసన కార్యక్రమాలు, దీక్షలు జరుగుతునే ఉన్నాయి. అదే సమయంలో ఆయా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధ వైఖరి కూడా ప్రజలకు తెలిసిపోతునే ఉంది. గతంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా ఇటువంటి నిర్బంధాలు ప్రయోగించి రాజకీయంగా నష్టపోయి ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఇప్పుడు జగన్ ప్రభుత్వమూ అందుకు అతీతమేమీ కాదని పబ్లిక్ టాక్.

జైలు సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి కృష్ణసాయితేజ్

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

సబ్ జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ అథారిటీ చైర్మన్ పిఎస్‌విబి కృష్ణసాయితేజ్ అన్నారు. శనివారం స్థానిక సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు అక్టోబర్ 2న గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవ సందర్భంగా రిమాండ్ ఖైదీలకు ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ జైల్లో సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమాండ్ ఖైదీల కాఫీలు పరిశీలించారు. జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు కోర్టు సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, ప్యానెల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు, జైలు సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి -వీరఘట్టం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సాకేటి రాంబాబుకు శనివారం విశాఖపట్నం చెందిన జిఆర్టి జ్యువెలర్స్ షాప్ సంస్థ చిట్టిపూడివలసలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఆర్టి జువెలర్స్ సంస్థ వారు మాట్లాడుతూ అన్ని రంగాల కంటే విద్యా రంగం ఎంతో విలువైందని, విద్యా బోధన మంచి గుర్తింపు తీసుకొచ్చిందని, మరిన్ని అవార్డులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయకు డివైన్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక డివైన్ స్కూల్ విద్యార్థులకు నవోదయ పాఠశాలలో ఆరో తరగతికి ప్రవేశానికి సీటు లభించిందని కరస్పాండెన్స్ ధనుంజయనాయుడు తెలిపారు. తమ పాఠశాలలో చదివిన బుడితి హరిహరన్‌కు ఈ సీట్ లభించిందని ఆయన తెలిపారు. ఈమేరకు స్కూలు యాజమాన్యానికి హరిహరన్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పోల్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్‌గా హరి

ప్రజాశక్తి - కొమరాడ

మండల టిడిపి పోల్‌మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గా పడాల హరిప్రసాద్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. కోఆర్డినేటర్‌గా ఎంపికైన హరిప్రసాద్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ బోలోపేతానికి తనవంతు కషి పూర్తిస్థాయిలో చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో మాజీ మంత్రి విజయరామరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ జగదీశ్వరికి, మండల పార్టీ అధ్యక్షులు వివిధ నాయకులకు అభినందనలు తెలిపారు.

నగర పంచాయతీ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ పాలక మండలి సమావేశం శనివారం వాయిదా పడింది. చైర్‌పర్సన్ రాధాకుమారి భర్త అకాల మరణంతో సమావేశాన్ని వాయిదా వేశారు. వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కమిషనర్ సర్వేశ్వరరావు సంతాపం తెలియజేశారు.

రైతు శాస్త్రవేత్తలకు శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం రైతు శాస్త్రవేత్తలు, శిక్షణా తరగతులు పార్వతీపురంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆత్మ ఎడిఎ డాక్టర్ శారద ప్రారంభించగా, రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ కె. ప్రకాష్, కె.రమాప్రభ, డాక్టర్ వై.నీరజ, ఎం.మానస వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నెలవారీ పనిని సమీక్షించి, ప్రణాళికను తయారు చేయడం జరుగుతుంది. యువతీ యువకులు ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములు చేయడమే ఈ కార్యక్రమం ప్రధానంగా ఉద్దేశం. ఈ జిల్లాలో ఉన్న 30 మంది రైతు శాస్త్రవేత్తలు, మెంటార్స్ కార్యక్రమానికి హాజరయ్యారు.

420 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

ఒడిశా రాష్ట్రం పిప్పలగూడ నుంచి బొలెరో వ్యాన్‌తో అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్సై షణ్ముఖరావు కురుపాంకు సమీపాన గల కొత్తబల్లుకోట వద్ద శనివారం స్వాధీన పరుచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొలెరో వ్యాన్లో 21 క్యాన్‌లో 420 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా వ్యాన్‌తో పాటు నాటు సారాను స్వాధీన పర్చుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

2న 'జగనన్నకు చెబుదాం' రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా సోమవారం సెలవు ప్రకటించినందున ఆ రోజు నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉండదని డిఆర్‌ఓ జె.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీన్ని ప్రజలు గమనించాలని కోరారు.

స్థలాలున్న వారికి ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సొంత స్థలాలు కలిగి ఉన్న వారికి గహాలు మంజూరు చేయాలని హౌసింగ్ బోర్డు సమావేశంలో హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ భోగి లతా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. స్థలాలున్నప్పటికీ గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం లేదని అనుమతి ఇవ్వాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో పిఎసిఎస్ డైరెక్ట్ భోగి మాణిక్య చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

ప్రజాశక్తి -భామిని

మండల స్థాయి జీవన ప్రమాణాలు అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంకల్ప్ సప్తహ్ స్కీంలో ఆకాంక్షిత మండలాల్లో భామిని మండలం ఎంపికైంది. ఈ మేరకు ఐటిడిఎ పిఓ కల్పనాకుమారి, డిఎల్‌పిఓ సత్యనారాయణ, ఎంపిడిఓ జి.చంద్రరావు, సెక్రటరీ ఎం.మహేంద్ర, ముగ్గురు సర్పంచులు ఢిల్లీలో నిర్వహించిన సంకల్ప్ సప్తహ్ ప్రారంభ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్‌లో సిబ్బంది, అధికారులు వీక్షించారు. అనంతరం జెడ్‌పి సిఇఓ వెంకటరావణ్ మాట్లాడుతూ మండలంలో మూడేళ్ల పాటు నీతి అయోగ్ ప్రత్యేక నిధి ద్వారా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తారన్నారు. దీంతో మండలం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు ఒక ముఖ్య ఘట్టమని, కావున వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తుకు చక్కని బాటలు వేసుకునేందుకు తల్లిదండ్రులు తగిన విధంగా ప్రోత్సహించాలని ఎల్విన్ పేట సిఐ సత్యనారాయణ అన్నారు. భద్రగిరి ఎపి ఆర్ గిరిజన గురుకుల కళాశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో సిఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు సరైన నడవడిక ముఖ్యమన్నారు.అనంతరం ఉత్తమ నడవడిక, ఫలితాలు సాధించిన ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్ ఉన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సిఐ సత్యనారాయణ

ఆరోగ్య రక్షణే జెఎఎస్ లక్ష్యం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రజలందరి ఆరోగ్య రక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని అన్నంరాజువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలానికి ఒక గ్రామం చొప్పున ఈ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి నిపుణులైన వైద్యులతో సత్వర చికిత్స అందుబాటులోకి వస్తుందని, ఈ కార్యక్రమము ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన గర్భిణీలకు సీమంతల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సీమల రాములమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంత కుమారి, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎంహెచ్ శివకుమార్, మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యులు కనకాల శ్రీకాంత్, సర్పంచులు, ఎంపిటిసిలు, వైద్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట :మండలంలోని విశ్వనాథపురంలో డిప్యూటీ సీఎం పి రాజన్న దొర జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి ప్రమీల, వైసిపి మండల కన్వీనర్ గొట్టాపు ముత్యాల నాయుడు, సర్పంచ్ సత్యవతి, వైసిపి నాయకులు దండి ఏడుకొండలు, పాచిపెంట వీరమనాయుడు, ధనుంజయరావు, డిఎం హెచ్‌ఓ బి.జగన్నాథరావు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జియమ్మవలస మండలం టికె జమ్ములో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల వద్ద రిసెప్షన్, మందులు, పరీక్షలు, రోగుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. మండల పరిశీలన అధికారి ఎండి నాయక్, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాలకొండ: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కళావతి

మక్కువ : మండలంలోని వెంకట భైరపురం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పీ రాజన్న దొర ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఓ విష్ణు చరణ్, జడ్పిటిసి సభ్యులు ఎం శ్రీనివాసరావు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరికష్ణ స్థానిక సర్పంచ్ ఎం వెంకటరత్నం, మండల వైసీపీ నాయకులు, ఎంపిడిఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పి.ఆమిటిలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరానికి గిరిజనుల నుంచి మంచి స్పందన వచ్చింది. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి పరిశీలన అధికారి గిరి వెలుగు ఏపిడి వై సత్యం నాయుడు, ఎంపిడిఓ సాల్మన్ రాజు, డిప్యూటీ తాసిల్దార్ రాజేంద్ర, ఐసిడిఎస్ పిఓ సుశీలదేవి తదితర శాఖల అధికారులు , వైద్య సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు పూర్తిస్థాయి ఆరోగ్య భరోసా జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్టణంలోని 1,2,3,4,13, 14,15 వార్డు సచివాలయాల పరిధిలో గల జగన్నాథపురంలో ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బి గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ఎన్‌జిఓ ప్రెసిడెంట్ కిషోర్, వైద్యాధికారులు, వైద్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే ఎ.జోగారావు పరిశీలించారు. ఆర్డీవో హేమలత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎంఎల్ఎస్ఎన్ ప్రసాద్, ఎంఇఓ జి.సూరిదేముడు, పెదంకలాం, సీతానగరం వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, కె.శిరీష, డిఐఓ టి.జగన్మోహన్‌రావు, గ్రామ సర్పంచ్ దాసు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ శ్రీరాములు నాయుడు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులతో పాటు వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని లుంబూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ప్రారంభించారు. వైద్యశిబిరంలో జనరల్ ఫిజీషియన్లు, గైనకాలజిస్ట్, ఆర్థో విభాగాలకు చెందిన వైద్యులు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో బొమ్మాళి భాను, శ్రీ కణపాక సూర్య ప్రకాష్, వాకముడి అనిల్, తిర్లంగి ఉపేంద్ర, పడాల రామచంద్రరావు, ఎస్.అప్పారావు, రౌతు వాసుదేవరావు గారు పాల్గొన్నారు.

రోగుల పాట్లు

జియ్యమ్మవలస : వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక నగర పంచాయతీ పరిధిలో జరిగింది. అయితే అక్కడకు వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. తగిన విధంగా ఏర్పాట్లు చేయకపోవడంతో వారు ఇబ్బందుల పాలయ్యారు. కనీసం కూర్చొవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో రోగులు అవస్థలు పడ్డారు. కేవలం ముగ్గురు వైద్యులతో మమా అనిపించారు. వచ్చిన రోగులు వైద్యం కోసం క్యూ లైన్లలో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చింది.

వీరఘట్టం : స్థానిక సచివాలయం-3లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు ప్రారంభించారు. తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారుల జి ప్రదీప్ కుమార్ ఎన్ మానస, చిన్నపిల్లల వైద్య నిపుణులు వీణ సరస్వతి, ఎండి ఎన్ ప్రేమ్చంద్ జనరల్ మెడిసన్, ఎంపిడిఓ జిజె ప్రసాదు, ఎఓ వై వెంకటరమణ, మేజర్ పంచాయతీ ఈవో రామచంద్రరావు, ఎన్ఎంలు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని విక్రమపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మల్లికార్జునరావు వైద్యశిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో స్థానిక వైద్య అధికారి అరుణ్ కుమార్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు, జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ బహిరంగసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

విశాఖ ఉక్కు రక్షణకై అక్టోబర్ 5న చలో స్టీల్ ప్లాంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కురుపాంలో ఆయన గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే 950 రోజులుగా దీక్షా శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ పోరాటానికి మద్దతుగా సిపిఎం ఉత్తరాంధ్రాలో బైక్ యాత్ర చేపట్టి దీని ముగింపుగా విశాఖ స్టీల్ ప్లాంట్ దగ్గర కూర్మం పాలెంలో అక్టోబర్ 5న బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని, ఈ సభలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ కార్యదర్శి మండంగి శ్రీను, నాయకులు కె.సీతారాం, పువ్వుల పత్తి, తిరుపతిరావు, జి.సోమయ్య, కె.బలరాం పాల్గొన్నారు.

కురుపాం : బహిరంగసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పార్వతీపురంటౌన్ : విశాఖ ఉక్కు పరిరక్షణ కోరుతూ అక్టోబర్ 5న విశాఖపట్నంలోని కూర్మన్నపాలెం వద్ద గల విశాఖ స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరిగే బహిరంగ సభలో ప్రజలంతా పాల్గొనాలని సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు పట్టణ ప్రధాన రహదారిలో గల వ్యాపార వర్గాలకు, కార్మికులకు శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు.

గరుగుబిల్లి : విశాఖ స్టీల్ పరిరక్షణకై అక్టోబర్ 5న విశాఖలో జరిగే బహింగసభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు మండలంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగసభకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని వివిధ గ్రామాల్లో పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర, దాసరి వెంకట నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు అక్టోబర్ 5 న విశాఖపట్నం లో జరిగే బహిరంగ సభకు భారీగా ప్రజలు వచ్చి జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు కూనేరు సంతలో బహిరంగ సభను పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బాగిలి నరేష్, రవి వెంకటేష్, సోమరాజు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి -సాలూరురూరల్

మండలంలోని కొత్తవలసలో బాబు కోసం నేను కార్యక్రమం సాలూరు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమ అరెస్టుల గురించి కర పత్రాలు పంచారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు దాలమ్మ, ఎస్‌టి సెల్ అధ్యక్షులు కోట లక్ష్మణ, దొర లక్ష్మణ, శ్యామ్, యుగంధర్, వెంకటి, వెంకట రమణ పాల్గొన్నారు.

సీతంపేట : బాబుతో నేను నిరాహార దీక్షలు మండల కేంద్రంలో కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, ఎటువంటి అవినీతి మరకలేని నాయకుడిపై కేసులు బనాయించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ సాయి, సవర సూర్యం, బిగ్ బాస్, మహిళా నాయుకులు నిమ్మక పార్వతి, గంగమ్మ, తొండక భవాని, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా ఎల్ఎల్ పురం, బాసురు, పెదకోటిపల్లి టిడిపి మండల అధ్యక్షులు గండి రామినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోట సంగన్నాయుడు, బెజ్జిపురం వరహాలు నాయుడు, కిమిడి బంగారు నాయుడు, కనుగుల జనార్దన్‌రావు, తాడేల గణేష్, రణస్థలం ప్రభాకరరావు, బొంగు చంద్రశేఖర్, అల్లు గోవింద, రేజేటి నాగరాజు, జామి చిరంజీవి మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండల కేంద్రంలో బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో శనివారం చిన్నదిమిలి, కొరమ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పాశర్ల నాగేశ్వరరావు, బోగాపురపు రవి నాయుడు, అగుతముడి గోవిందరావు, పిన్నింటి కబీరదాస్, బలగ గోవిందరావు, ముంజెటి. రామారావు, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త విధానాలతో విద్యారంగం నిర్వీర్యం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలవల్ల రాష్ట్రంలో విద్యారంగం నిర్వీర్యమైపోతుందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శనివారం ఆయన కృష్ణపల్లిలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తామని అబద్దపు వాగ్దానాలు చేసి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మాటమార్చి, ఉద్యోగుల, ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రయోజనంలేని జిపిఎస్ విధానాన్ని వారి నెత్తిన రుద్దారని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నిర్వాకం వల్ల ఎయిడెడ్ పాఠశాల వ్యవస్థ నాశనమైపోగా, రేషనలైజేషన్ పేరిటి వందలకొద్ది పాఠశాలలు మూతపడ్డాయని మండిపడ్డారు. కొత్తగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు డిఎస్సీ ప్రకటించడం సంగతి అటుంచి సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ స్థానాలు మిగులు చూపించి భవిష్యత్తులో ఉపాధ్యాయ ఉద్యోగాలు లేకుండా చేశారని అన్నారు. చంద్రబాబు, నారాలోకేష్ అరెస్టు అంటూ ప్రజల దృష్టిని ఏమార్చి అసెంబ్లీలో ప్రజావ్యతిరేక బిల్లులను ఆమోదింపచేసుకున్నారని, అందులో 33 ఏళ్ల నిబంధన ఒకటని అన్నారు. తమప్రభుత్వం హయాంలో 47శాతం ఫిట్‌మెంట్ ప్రకటిస్తే జగన్ కేవలం 23శాతంతో సరిపెట్టారని, అలాగే డిఎ బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేంత వరకూ వారితో కలసి పోరాడతామని తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో మండల పార్టీ అధ్యక్షుల పునర్నియామకంపై వైసిపికి చెందిన నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం పట్టణ, పార్టీ అధ్యక్షులుగా కొండపల్లి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షునిగా బొమ్మిరమేష్, సీతానగరం మండలం బొంగుచిట్టిరాజు, బలిజిపేట పాలవలస మురళీకృష్ణలను పునర్నియమిస్తున్నట్లు ఉత్తుర్వుల సారాంశం. వారి నియామకం పట్ల జెడ్‌పిటిసి బలగరేవతమ్మ, ఎంపిపి మజ్జిశోభారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరీతో పాటు నాయకులు కార్యకర్తల ఆనందం వ్యక్తం చేయగా, ఎమ్మెల్యే అలజంగిజోగారావు ప్రత్యేకంగా వారిని అభినందించారు.

సాలూరు మండల కన్వీనర్‌గా భరత్ శ్రీనివాసరావు

సాలూరురూరల్ : మండల వైసిపి అధ్యక్షుడుగా సువ్వాడ భరత్ శ్రీనివాస రావును ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. మండల అధ్యక్ష పదవి కోసం మండలంలో తీవ్ర పోటీ ఉన్నప్పటికీ భరత్ శ్రీనివాసరావును అధిష్టానం వద్ద డిప్యూటీ సిఎం రాజన్నదొర సిఫార్స్ చేసి ఎంపిక చేయించారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పట్టణ అధ్యక్షులుగా వంగపండు

సాలూరు : పట్టణ వైసిపి అధ్యక్షుడిగా మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడుని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ , వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు గిరిరఘు రాపాక మాధవరావు గొర్లి వెంకటరమణ పప్పల లక్ష్మణరావు వంగపండు అప్పలనాయుడును అభినందిస్తూ పుష్పగుచ్చాలు అందజేశారు. పట్టణ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అప్పలనాయుడు చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర, పట్టణ పెద్దల సలహా సూచనల మేరకు పార్టీని నడిపిస్తానని చెప్పారు.

వైసి పి మండల కన్వీనర్‌గా తోట సింహాచలం

భామిని: మండలంలోని కాట్రగాఢ-బికి చెందిన సీనియర్ నాయకులు తోట సింహాచలం మండల కన్వీనర్ నియమితులయ్యారు. రెండు సార్లు మండలం వైసిపి కన్వీనర్‌గా పార్టీని క్షేత్ర స్థాయిలో బలపర్చి, నియోజకవర్గం వైసిపి గెలుపునకు కీలకంగా వ్యవహరించడంతో మూడో సారి కూడా కన్వీనర్‌గా సింహాచలం నియమితులయ్యారు. మూడోసారి కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి, ఎమ్మెల్యే వి.కళావతికి, ఎమ్మెల్సీ విక్రాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పచ్చని చెట్లు ప్రగతి మెట్లులని, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం కోరారు. ప్రతి నెలా నాల్గవ శనివారం హరితహారం కార్యక్రమంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ ఎస్ ఎస్ పిఓ త్రినాథ , అధ్యాపకులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హార్టికల్చర్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ హరిరామ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిసరాలను పరిశుభ్రతగా ఉండేలాగా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్న కుమార్, ఇతర ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొనడం జరిగింది.

మూఢనమ్మకాలతో భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మూఢనమ్మకాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక బృందం కురుపాం, గుమ్మలక్ష్మీ పురం ప్రాంతాల్లో పర్యటించింది. పార్వతీపురం, కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో, గుమ్మ లక్ష్మీ పురం ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనలపై అవగాహన కల్పించారు. పలురకాల ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజూర్ భాషా మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. లక్ష్యం దిశగా నిరంతరం ఆలోచన చేయాలని సూచించారు. భయం వీడాలని, ప్రశ్నించేతత్వం అలవర్చు కోవాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ పెంటన్న, జెవివి జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన ఇళ్లు త్వరగా నిర్మించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పలుగ్రామాలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ వంగపండు అఖిల్ నాయుడు వెల్లడించారు. మండల పరిధిలోని సన్యాసిరాజుపేటలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు తగుసూచనలు, సలహాలు అందజేశారు. అలాగే నిర్దేశించిన సమయంలోగా పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. పక్కాగృహాల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. గృహనిర్మాణశాఖ ద్వారా నిర్మిస్తున్న లబ్ధిదారులకు సిమెంటు సరఫరాచేస్తున్నామన్నారు. కార్యక్రమంలోపలువురు సిబ్బంది పాల్గొన్నారు.


స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

సిసి రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 26వ వార్డులో గల తెలికుల వీధి, పండా వీధి ల మధ్య ఉన్న పెరడు ఖాళీ స్థలం జంగిల్ క్లియరెన్స్ చేపట్టి సిసి రోడ్డు, కాలువల నిర్మాణం చేపట్టాలని తెలికుల వీధి మహిళలు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును కోరారు. శనివారం ఆ వార్డులో నా అడుగు మీకోసం కార్యక్రమంలో పాల్గొనిన్న ఎమ్మెల్యే వార్డులో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ రెండు వీధుల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో పందులు సంచారంతో పాటు విష సర్పాలు సంచరించడంతో భయాందోళనకు గురవుతున్నామని ఈ స్థలంలో రోడ్డును కాలువలను నిర్మించాలని 50ఏళ్లుగా పాలకులను, అధికారులను కోరినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని అన్నారు. కావున ఈ స్థలంలో కాలువలు, రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ వార్డులో గల పండా వీధి, తెలికలవీధి, వేమకోటి వారి వీధుల్లో సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, డిఇ పి.కిరణ్ కుమార్‌తో మాట్లాడి ఖాళీ స్థలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అభివద్ధి పనులు ప్రారంభించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయబాబు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కన్వీనర్లు జి.రవికుమార్, కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్, వై.త్రినాథ, లావణ్య, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతుల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఎంపిపి ఉరిటి రామారావు కోరారు. మండలంలోని ఉల్లిభద్ర పశుసంవర్ధక శాఖకార్యాలయం పరిధిలోని మరుపెంటలో 40 శాతం రాయితీపై ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిన గడ్డి కత్తిరించే యంత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ పాడి రైతులు మరింత ఆర్థికంగా అభివద్ధి చెందేలా పలు పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే పాలదిగుబడి మరింత పెంచేందుకు రైతులకు పశుగ్రాస విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలోఉల్లిభద్ర పసుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డికోత యంత్రాన్ని అందజేస్తున్న ఎంపిపి రామారావు